ఈనాడు, ఆదివారం: 17-9-1989

# ఎరను మింగిన చేప

బాలకృష్ణకు, ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చే సమయం. ఇదిగో, అదిగో వచ్చేసింది, వచ్చేస్తున్నది అని అందరూ అనుకుండే సమయంలో -

బాలకృష్ణపై ఆరోపణలు వచ్చాయి. బాలకృష్ణ పైకి రాగూడదని శపథం పట్టిన నరసింహానికి ఇది చక్కటి అవకాశంగా తోచింది.

బాలకృష్ణను ఉచ్చులో బిగించి దాంట్లోంచి, అతడు తప్పించుకోలేక గిలగిలలాడుతూ ఉంటే చూసి, సంతోషించాలని నరసింహం చిరకాలపు కోరిక.

పేషెంటూ మందే కోరాడు, డాక్టరూ మందే పుచ్చుకోమన్నట్లు అయింది పరిస్థితి.

ఇద్దరకూ సన్నిహితంగా ఉన్న మాబోటి బక్క ఉద్యోగులకు వెనుక నుయ్యి ముందు గొయ్యిలా వుంది పరిస్థితి.

"ఏమోయ్! మావాడి గొడ్డు గోతిలో పడ్డది తెలుసా?" - నరసింహం చాలా సంతోషంగా చెప్పాడు.

"తెలియదు సార్".

"నువ్వు దొంగవి! తెల్సినా బయటకు పొక్కవులె!" అన్నాడు నరసింహం.

ఏం జరిగిందో నే అడగలేదు. నరసింహం సంగతి నాకు తెలుసు - అడిగితే చెప్పడు. అది ఆయన స్వభావం!

అడక్కపోయినా, చెప్పకుండా ఉండలేడు. రెండు రోజులు పొయ్యాక, నన్ను పిల్చాడు బార్‌కు తోడు రమ్మని.

నరసింహం బార్‌కు ఒంటరిగా వెళ్ళడు. అది ఆయన నియమం. వెంట డబ్బు పెట్టుకునే వాడుండాలి. వాడు నరసింహాన్ని బ్రతిమలాడాలి. ఆశ పెట్టాలి, బొంకాలి.

"సార్! మీ అంత పెద్దలను అడగటం నా బోటి చిన్నవాళ్ళకు కాని పని అనుకోండి. అయినా మీరంటే నాకెందుకో మొదట నుండీ అభిమానం సార్. మీరు పనిచేసే తీరు, రూల్‌ను విశ్లేషణ చేసే పద్ధతి, న భూతో న భవిష్యతి సార్! ఇది నా ఒక్కడి అభిప్రాయం

కాదు సార్. చాలామంది మీ గురించి చెప్పగా విన్నాను సార్....." - ఇలా ఆయనతో పని ఉన్నవాడు, పనిచేయించుకోతలచిన వాడు, వెంటబడి, పొగిడి ములగ చెట్టు ఎక్కిస్తే-

నరసింహం, బీరులా పొంగుతాడు. గజం బద్ద మ్రింగిన వాడిలా, నిటారుగా రొమ్ము విరుచుకు నిలబడతాడు.

"నాకు పొగడ్తలంటే గిట్టవోయ్" అంటాడు. అలా అన్నాడని, పొగడకపోతే ఊరుకోడు. బల్ల మీద కొచ్చిన ఫైలును గొరిగేస్తాడు, మళ్ళీ మొక్క మొలవకుండా. ఇవన్నీ మా ఆఫీసు కొచ్చే వాళ్ళందరికీ తెలుసు.

అలా నానా పిల్లిమొగ్గలు, తోకాడింపులూ అయ్యాక, నరసింహం ఇష్టం లేనివాడిలా అయిష్టంగా మొహం పెట్టి, ఏదో కొండ ఎత్తి తల మీద పెట్టిన వాడిలా చూసి, "సర్లే, సాయంత్రం కలు! ఎక్కడ?" అనంటాడు.

అప్పుడు వచ్చినవాడు ఫలానాచోట అని అన్నాడో, వాడి పని హుళక్కే, దేభ్యంలా మొహం పెట్టి "తమరు చెప్పండి సార్" అనాలి. అంటే -

అప్పుడు నరసింహం నాబోటి వాడిని, పిల్చి, "చూడవోయ్! ఏదో పార్టీ అని ప్రాణం తీస్తున్నాడు. ఎక్కడో మంచి ప్లేస్ చూసి చెప్పు, నా సంగతి తెలుసుగా, బాలకృష్ణలా ఎక్కడ పడితే అక్కడకు పిలవంగానే పరిగెత్తను" అని పురమాయిస్తాడు.

ఇదంతా ఓ నాటకం.

ఇలాంటి నాటకాల్లో నేను చాలాసార్లు పాత్రధారణ చేశా, తప్పించుకోలేక!

అలాగే, ఆ రోజూ వెళ్ళా, నరసింహంతో బారుకు!

నరసింహం త్రాగేది తక్కువ, వాగేది ఎక్కువ. అందునా, నా బోటి బంటు, వినటానికీ, 'ఊ' కొట్టడానికీ దొరికి, డబ్బు పెట్టుకునేవాడు కేవలం తలూపేవాడయితే, నరసింహం పగ్గం తెంపుకున్న అబోతు అవుతాడు.

ఆ రోజు అదే అవతారం ఎత్తాడు. బార్‌లో 'ఛీర్స్' అని అనటం ఆలశ్యం - నరసింహం బాలకృష్ణ నామస్మరణతో ఆ రోజు గడిపాడు.

ఆయన చెప్పిన విశేషాలేమంటే బాలకృష్ణ త్రాగుతూ, వేశ్యతో పట్టుబడ్డాడు, సాక్ష్యాధారాలతో!

"ఏమోయ్! అంతేనా?" అని సాక్ష్యమడిగాడు, మూడోవాడిని!

మూడోవాడు తలూపాడు.

"ఏం జరిగిందో అడగవేం?"

నే అడగలేదు.

నరసింహమే చెప్పాడు.

బాలకృష్ణ ఆఫీసు పనిమీద కర్నూలు వెళ్ళాడు. అక్కడ ఎంక్వయిరీ పూర్తిచేసుకుని, ఆ రాత్రి మందు తాగాడు. ఆ తర్వాత ఓ ఆడమనిషిని పక్కలో వేసుకుని గడిపాడు.

అంతేగాదు -

ఆ ఆడమనిషిని ఆఫీసు జీపులో వెంట తెచ్చుకున్నాడు. వస్తూ, వస్తూ దారిలో ఓ బహిరంగ కూడలిలో ప్రభుత్వ జీపు ఆపి, రోడ్డు మీద గల బారులో అమ్మాయితో కల్సి మందు త్రాగాడు.

అన్నిటికీ మూడో మనిషి తలూపాడు.

బాలకృష్ణ ప్రభుత్వ డ్యూటీలో ఉండగా, ఇలాంటి పనులు చేయడం, నియమ నిబంధనలకు వ్యతిరేకం. కాండక్టు రూల్స్ ప్రకారం నిషిద్ధం. కనుక బాలకృష్ణ ఉద్యోగం ఖరారావుడీ అవటం ఖాయం.

ఇది నరసింహం చెప్పింది.

నిజంగా, ఇదంతా జరిగిందా?

బాలకృష్ణకు ఇవన్నీ చెప్పా. నిజానిజాలు చెప్పమని అడిగా.

బాలకృష్ణ నవ్వాడు.

"నరసింహం చెప్పిందంతా నిజమే!" అన్నాడు.

బాలకృష్ణను అప్పుడు చూసిన నాకు జాలేసింది.

బాలకృష్ణ చాలా బేఫరవాగా ఉన్నాడు. అతని మొహంలో ఏమాత్రం భయం, బెంగ, భీతి, లేదు. ఏమీ జరగనట్లు ఉన్నాడు.

ఇంత నింపాదిగా బాలకృష్ణ ఎలా ఉండగలడు?

నాకు తెలిసినంతవరకూ బాలకృష్ణకు లేని అలవాటంటూ లేదు!

బాలకృష్ణ తాగుతాడు.

హుషారొస్తే, పేకాడతాడు.

ఏమీ తోచకపోతే రేసుల కెడతాడు.

ఏ ఆడదన్నా కంటికి సదరుగా కనపడితే వెంటపడతాడు.

సహాయం చేతనైతే చేస్తాడు, అడక్కుండానే.

ఆఫీసు విషయాల్లో చురుగ్గా ఉంటాడు.

ఫైళ్ల త్వరగా త్వరగా చూస్తాడు. చక్కటి ఆర్డర్లు వేస్తాడు.

సమర్థుడైన ఆఫీసరని పేరుంది.

బాలకృష్ణకు అన్నిటికి మించి, కావల్సినంత పిత్రార్జితముంది.

మంచి ఉద్యోగముంది.

ఇవాళో రేపో ప్రమోషన్ వచ్చే సూచనలున్నాయి.

ఇలాంటి సమయంలో....

నరసింహం గోతికాడ నక్కలా చూస్తున్నాడు. ఎప్పుడు బాలకృష్ణ ఎరకు తగులుకుని గిలగిలలాడతాడా అని!

బాలకృష్ణ, నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాడు.

రోజులు గడుస్తున్నాయి.

నాబోటి వాళ్ళకు ఏమవుతుందా? అని ఆత్రుతగా వుంది.

ఓ రోజు బాలకృష్ణకు ప్రమోషనొచ్చింది, ఆఫీసు అధిపతిగా!

ఆ వార్త భూకంపంలా, ఉప్పెనలా, అనిపించింది పరిస్థితులు తెల్సిన నాబోటి వాళ్ళకు!

ఇదెలా సాధ్యం?

సాక్ష్యాలు, పిటిషన్లు కాక, ఫొటోలు కూడా బాలకృష్ణ నేరాన్ని నిరూపించాయని విని కిడి?

మరి.....??

నరసింహం పిలవకపోయినా వెళ్ళా!

నరసింహం అప్పుడే భార్య పోయిన వాడిలా వున్నాడు.

అధాటుగా చూసేవాళ్ళకు పక్షవాతం రెండు పక్కలా వచ్చిందేమో - కుర్చీలో కూర్చునే, హార్ట్ఎటాక్ వచ్చి హంస లేచిపోయిందేమో, అనిపించేలా ఉన్నాడు నరసింహం!

నేను ఏమైందీ అని అడగలేదు!

నరసింహమే చెప్పాడు, ఆ షాక్ నుంచి తేరుకున్నాక.

నరసింహం గొంతు, లంఖణాలు చేసిన పిల్లిలా వుంది.

"మీవాడు అసాధ్యుడోయ్" అన్నాడు.

"ఎరను మింగేశాడు."

"ఊబిలో దున్న బయటకు, అదీ ఎవరి సహాయం లేకుండా రావటం... ఆశ్చర్యం."

"పిడుగు పడి బ్రతకటం అంటే ఇదే!"

ఇలా చాలా చెప్పాడు.

ఎలా? తప్పించుకున్నాడు? - నే అడగలేదు. నరసింహం చెప్పనూ లేదు.

బాలకృష్ణను అభినందించటానికి వెడితే, "ఏమోయ్! మా సింహం ఏమంటున్నది" అనడిగాడు.

నవ్వి ఊరుకున్నా. ఇద్దరూ ఏనుగులు. నా జీవితం, ఉద్యోగం కుందేల్లాంటివి.

"నరసింహం, ఈ దెబ్బతో నా పని గోవిందా! అని అనుకోనుంటాడు. పాపం కలలు కూడా కని ఉంటాడు. వాడికో సంగతి తెలియదు!"

"ఏమిటి సార్?"

"నా వెంట ఉన్నది ఎవరనుకున్నావ్?"

నాకు తెలియదు! అదే చెప్పా!

"నా భార్యోయ్!"

బాలకృష్ణ నవ్వేశాడు!

•